


ఆనంద్ సైకాలజిస్ట్ అయ్యాక అతని ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. ఏదైనా షాపుకెళ్లి సరుకులు కొనాలన్నా, ఆ షాపు ఓనర్ సైకాలజీ ఏంటో ముందే తెలుసుకొని, ఆ తర్వాత మాత్రమే సరుకులు కొనేవాడు. అదేంటని ఎవరైనా అడిగితే "ఆ షాపు ఓనర్ సైకాలజీ ఏంటో తెలుసుకోకపోతే, అతను నిజాయితీపరుడా లేక సరుకులు కల్తీ చేసి లాభాలు గడించేవాడా అనేది ఎలా తెలుస్తుంది?" అని సైకాలజీ గురించి పెద్ద లెక్చర్ దంచేవాడు.

అలాంటి సైకాలజిస్ట్ ఆనంద్ పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. బ్రోకర్స్ తెచ్చిన బోలెడు అమ్మాయిల ఫోటోల్లో నందిని అనే అమ్మాయి నచ్చిందని చెప్పాడు. ఈ విషయం నందిని పేరెంట్స్ తెలుసుకుని ఆనంద్‌కి తమ కూతుర్ని ఇవ్వడానికి సంతోషంగా ఒప్పుకున్నారు.

కానీ ఆనంద్ ఓ షరతు పెట్టాడు. తను నందినిని పెళ్లి చేసుకోవాలంటే ఆమె తల్లిదండ్రులు వచ్చి ఓ వారం రోజులు తన ఇంట్లో వుండాలన్నాడు. మంచి సంబంధం వదులుకోవడం ఇష్టం లేని నందిని పేరెంట్స్ "సరే" అన్నారు.

తన ఇంట్లో వున్న నందిని తల్లిదండ్రుల్ని రోజూ అబ్జర్వ్ చేసేవాడు. పార్క్‌లకు, సినిమాలకు తీసుకెళ్లి నిశితంగా వాళ్లని గమనించేవాడు. మొత్తానికి వారం తర్వాత "మీరు నాకు అన్నివిధాలా నచ్చారు. నేను మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాను" అని ప్రకటించాడు.

"ఎందుకురా ఆ అమ్మాయి వాళ్ల అమ్మనీ నాన్ననీ రమ్మని, వారం రోజులు పెట్టుకుని పంపేశావ్" అని ఆనంద్ ఫ్రెండ్స్ అడిగారు.

"ఈ వారం రోజులూ వాళ్ల అలవాట్లు, ప్రవర్తన బాగా గమనించాను. వీళ్లు చాలా ఓర్పు గలవాళ్లు. పైగా కోపం, ఆవేశం లాంటివి ఏ కోశానా లేవు. ఇలాంటివారి ఇంట్లో పెరిగిన అమ్మాయికి వీళ్ల బుద్ధులే వస్తాయి. ఆ అమ్మాయి నా భార్య ఐతే నేను జీవితాంతం మనశ్శాంతిగా, సంతోషంగా సంసారం చేయగలుగుతాను. అందుకే నా సైకాలజీ బుర్రను ఉపయోగించాను!" అని గర్వంగా చెప్పాడు ఆనంద్.

* * *

ఆరోజు ఆనంద్, నందినిల పెళ్లి జరుగుతోంది. తాళి కట్టడం అయ్యాక, అందరూ భోజనాలు చేస్తున్నారు. ఇంతలో ఒకావిడ అక్కడ వడ్డించేవాళ్లతో గొడవకు దిగి, వాళ్లను నానా బూతులు తిడుతోంది. ఈలోగా ఆవిడ భర్త ఆమెను వారించబోతే అతని మీదే ఆమె చెయ్యిచేసుకుంది. దాంతో ఆమె భర్త ఆమెను జుట్టు పట్టుకొని కొట్టి, కాలితో తన్నాడు. వెంటనే అందరూ కల్పించుకొని గొడవను సద్దుమణిగేట్టు చేశారు.

ఇంతలో ఆనంద్ "ఏంటా గొడవ? ఎవరు వాళ్లు?" అని అక్కడో వ్యక్తిని అడుగుతుండగా "వాళ్లు మా బాబాయి, పిన్ని" అని చెప్పింది నందిని.

"చూస్తుంటే సంస్కారం లేని మనుషుల్లా వున్నారు. ఇంతమందిలో అలా ప్రవర్తించడానికి వాళ్లకి సిగ్గులేదూ! అలాంటివాళ్లు ఇక్కడ వుండడానికి వీల్లేదు, వెంటనే వెళ్లిపొమ్మని చెప్పు" అన్నాడు ఆనంద్ నందినితో.

"నేను చెప్పను" అంది నందిని.

"ఏం..?" అన్నాడు ఆనంద్.

"ఎల్.కె.జి నుండి డిగ్రీ వరకు నేను వాళ్ల ఇంట్లో ఉండే చదువుకున్నాను. నేనెళ్లి చెబితే బాధపడరూ! అయినా భార్యాభర్తలన్నాక ఇలాంటి గిల్లికజ్జాలు మామూలేగా!" అని నందిని ఇంకా ఏదో చెబుతోంది. ఆమె మాటలు వింటున్న ఆనంద్‌కి కళ్లు బైర్లు కమ్ముతుంటే తన సైకాలజీ బుర్రను ఉపయోగించి సపోర్ట్‌గా గోడను పట్టుకున్నాడు. ★